www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 మార్చి 2024

5

అన్నమయ్య

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రాయచోటి : ఈ నెల 11, 12, 13వ తేదీలలో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చిత్తూరు జిల్లా పలమ నేరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. పోటీలకు జిల్లా నుంచి 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. గత నెల 12న రాయచోటిలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులను నేషనల్ ఇన్నో వేషన్ ఫౌండేషన్ సభ్యులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించాలన్నారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరు కావడానికి వీలులేదని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారన్నారు. గైడ్ టీచర్లు, విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో తప్పనిసరిగా పాల్గొనేటట్లు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు.

ఇళ్లకు 'జువారి' ఎఫెక్ట్

- బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు పగుళ్లు
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టని యాజమాన్యం

బ్లాస్టింగ్ కారణంగా నెర్రలు చీలిన ఇంటి గోడ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దేశంలోనే సిమెంట్ రంగంలో ఎంతో పేరు గాంచిన సంస్థ జువారి సిమెంట్స్. నాణ్యత గల సిమెంట్‌కు పెట్టింది పేరుగా ప్రసిద్ధి. ఈ సిమెంట్ కర్మాగారం వల్ల వందల మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయనేది అందరికీ తెలిసిన సత్యం. కానీ అదే జువారి కర్మగారం పాదాల కింద పడి నలుగుతున్న గ్రామాలు కూడా ఉన్నాయన్నది అంతే సత్యం. కర్మాగారం చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఏదో ఒక సమస్యతో అల్లాడుతున్నారు. జువారి కర్మాగారం ఉన్న గ్రామాల్లోని భూగర్భంలో నాపరాయి నిక్షేపాలు అధికంగా ఉండడం ఆ గ్రామాల ప్రజలకు వరమో... శాపమో...అర్థంకాని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. ఆనాడు కర్మాగార నిర్మాణం కోసం ఎర్రగుంట్ల మండలంలోని వలసపల్లి, తుమ్మలపల్లి, కోడూరు, పెదనపాడు గ్రామాల ప్రజలు తమ భూములను త్యాగం చేశారు. ఇప్పుడు అదే కర్మాగారం వల్ల ప్రజలు నష్టపోతున్నారు. కర్మాగారంలో నాపరాయి తవ్వకాల కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కారణంగా మండలంలోని వలసపల్లి గ్రామంలో పలు ఇళ్లు బీటలు వారి కూలిపోయే పరిస్థితులలో ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వలసపల్లి గ్రామానికి కూతవేటు దూరంలోనే జువారి మైనింగ్ చేపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. మైనింగ్‌లో నిర్వహించే భారీ పేలుళ్ల కారణంగా భూమి కంపిస్తోందని, దానివల్ల ఇళ్లకు పగుళ్ళు ఏర్పడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో నాపరాయి తవ్వకాల కోసం మందు గుండు సామాగ్రితో భారీ పేలుళ్ల సృష్టిస్తున్నారని, దాని కారణంగా లక్షలు విలువ చేసే ఇళ్లు శిథిలమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలు రూపాయి రూపాయి కూడా పెట్టి సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటుంటే, మైనింగ్ పుణ్యమా అంటూ కట్టుకున్న ఇళ్లు కూలిపోతుందో తెలియక బిక్కు బిక్కుమంటూ జీవించే పరిస్థితులలో ఉన్నామంటూ ఆందోళన చెందు తున్నారు. సాధారణంగా 42 నుంచి 50 ఏళ్లు ఉండాల్సిన ఇళ్లు బ్లాస్టింగ్ కారణంగా 15 నుంచి 20 ఏళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయని పలువురు వాపోతున్నారు. బ్లాస్టింగ్ జరిగిన సమయంలో ఏర్పడే దుమ్ము గ్రామం మొత్తం వ్యాపిస్తోందని, దుమ్ముతో సహజీవనం చేస్తు న్నామని పేర్కొంటున్నారు. అధికారులకు, జువారి యాజ మాన్యానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వెల్లడించారు. ఇలాగే కొనసాగితే గ్రామం వదిలి వెళ్లాల్సి ఒదేనని, వేరే గత్యంతరం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి జువారి యాజమాన్యం, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బ్లాస్టింగ్ దెబ్బకు ఇంటి ప్రహరికి ఏర్పడిన పగుళ్లు

నిలువ నీడ లేకుండా పోతోంది...

జువారి కర్మాగారం నాపరాయి కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కారణంగా గ్రామంలోని ఇళ్లు చాలా వరకు శిథిలావస్థకు చేరు కున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో భూమి మొత్తం ఒక్కసారిగా కంపిస్తోంది. ఒక్కోసారి ఇళ్లలోని వస్తువులు కూడా కింద పడతాయి. ఆశగా నిర్మించుకున్న ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంటే బాధపడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. బ్లాస్టింగ్ సమయంలో ఏర్పడే దుమ్ముతో ఒకవైపు పంట పొలాలు నాశనం అవుతుంటే మరోవైపు బ్లాస్టింగ్ కారణంగా కట్టుకున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. గ్రామస్తులకు కళ్ళెదుటే నిలువు నీడ లేకుండా పోతోంది. జువారి యాజమాన్యం సమస్యపై స్పందించి న్యాయం చేయాలి.

\- సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తుడు, వలసపల్లి.

మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

\- మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాహిల్

ప్రజాశక్తి-మదనపల్లె

మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాహిల్ దాదా గాంధీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఎంతో ఘనమైందన్నారు. భారతదేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర అమోఘమైందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి విధానాలతో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో పాలన కొనసాగిస్తూ విభజించు పాలించు అనే విధానంతో ముందుకెళ్తున్నారని విమర్శించారు. జిఎస్‌టి రూపంలో ప్రజలు ధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి విధానాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. బిజెపి పెద్దలు ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్న నోరు మెదపడం లేదన్నారు. బిజెపి పాలన నుండి దేశాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారన్నారు. పార్లమెంటులో ముస్లిం వ్యతిరేక బిల్లులకు రాష్ట్రంలోని వైసిపి,టిడిపిలు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. డిసిసి అధ్యక్షులు అల్లా బకాస్ మాట్లాడుతూ బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని, వైసిపి, టిడిపి, జనసేనలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లేనన్నారు. ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో అరాచకాల తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె.బాషా, డిసిసి ఉపాధ్యక్షులు మీనా కుమారి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, అరిఫుల్లా నాయకులు రాజంపేట సయ్యద్, నిమ్మనపల్లి మండల అధ్యక్షులు పఠాన్ ముబారక్ ఖాన్, రూరల్ మైనార్టీ అధ్యక్షులు అల్లాబకష్, రామసముద్రం మండల అధ్యక్షులు ఖాదర్ బాషా, మహబూబ్ పీర్, మదనపల్లి టౌన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అలీ, డిస్ట్రిక్ట్ సోషల్ మీడియా చైర్మన్ మహమ్మద్ రఫీ, మదనపల్లి పట్టణ మహిళా అధ్యక్షులు ఈశ్వరమ్మ, సయ్యద్, సోను,ఖాసీం, బక్షు, దిలీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాహిల్

చిన్నారులకు విద్యా సామగ్రి అందజేస్తున్న కాస్మో సంస్థ సభ్యులు

చిన్నారులకు విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శనివారం కాస్మో సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలసదన్ చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, తినుబండారాలు, శీతల పానియాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాస్మో టీం నాయకులు జవ్వాజి సాయి సందీప్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్థిక రంగంలో ముందుకు పరిగెడుతున్న కాస్మో సంస్థ తమ అభివృద్ధి మాత్రమే కాక పేదల అభ్యున్నతి కూడా ధ్యేయంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని తెలిపారు. అనాథ శరణాయాలకు తోచినంత సాయం చేయడంతో పాటు పేద విద్యార్థుల విద్యా ప్రగతి కోసం నిరంతరం పాటుపడుతోందని పేర్కొన్నారు. కాస్మో సంస్థ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ పేదలు, అనాథలు, నిరాశ్రయులకు సాయి మందిరంలో ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. తమ టీం ఇప్పటికే 150 మంది వరకు విస్తరించిందని, మున్ముందు మరింత ప్రగతి సాధించి సమాజానికి తమ వంతు సేవ, సహాయ-సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కాస్మో సంస్థ సభ్యులు నాగార్జున, మణి, వెంకటేష్, తేజ, ప్రశాంత్, పెంచలయ్య, సుకుమార్, సురేష్, రామయ్య పాల్గొన్నారు.

యాత్రికులకు తాగునీటి బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేరం బార్ అండ్ రెస్టారెంట్ అధినేత పేరం ఇరగంరెడ్డి దాతృత్వంతో శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికులకు ఉచితంగా ఐదువేల తాగు నీటి బాటిల్‌లను శనివారం ఆలయ చైర్మెన్ విజయమ్మ, ఇఒ రమణరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ విపరీతంగా పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని యత్రికులు తాగునీటి కష్టాలు పడకుండా దాత తల్లి తండ్రుల జ్ఞపకార్థం ఉచిత మంచి నీటి బాటిళ్లను అందించామని అన్నారు. భవిష్యతులో ప్రజలకు ఉపయోగ పడే మరెన్నో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సందర్భంగా దాత ఇరగం రెడ్డికి దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు లయన్ చాంద్ బాషా, లయన్ మహమ్మద్, కోశాధికారి లయన్ హరీష్ చంద్ర, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి లయన్ ప్రకాష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రత్న శేఖర్ రెడ్డి, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుని బ్రహ్మోత్సవాలు పటిష్టంగా నిర్వహిస్తాం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు పటిష్టంగా నిర్వహిస్తామని డిఎస్‌పి మహబూబ్ బాషా పేర్కొన్నారు. శనివారం వీరభద్ర స్వామి ఆల యంలో ఆలయ కమిటీ చైర్మన్ విజయ, ఇఒ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరధరామి రెడ్డితో కలిసి ఏర్పాట్లను డిఎస్‌పి మహబూబ్‌బాషా, అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి సమీక్షించారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టాలైన నంది వాహనం, అగ్ని గుండం, మహా నైవేద్యం, రథోత్సవ కార్యక్రమాలకు లక్షకు పైగా కర్ణాటక యాత్రికులు హాజరవుతారన్నా అంచనాతో మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఇప్పటికే ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు భక్తవస్థలం, జీవన్, ఎంఆర్ఐ మల్లికార్జున, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇఒ, సిఐ, అధికారులు

శ్రీకామాక్షి దేవికి పట్టు వస్త్రాలు సమర్పించిన 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన అత్యంత పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి శనివారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి పోటెత్తారు. భక్తుల శివ నామస్మరణలతో అత్తిరాల పుణ్యక్షేత్రం మార్మోగి పోయింది. డిఎస్‌పి వి.ఎన్.కె.చైతన్య ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కావలసిన మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో భక్తులు ప్రశాంతంగా స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.

చలివేంద్రం ఏర్పాటు

అత్తిరాలలో బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తన తండ్రి చింతల సుబ్బరాయుడు జ్ఞాపకార్థం రెండు రోజులపాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని మున్సిపాలిటీ 16వ వార్డు ఇన్‌ఛార్జి చింతల హరీష్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు చింతల ప్రశాంత్, పెంచలయ్య, చంగయ్య పాల్గొన్నారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న మేడా

రహదారులకు మహర్దశ : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రహదారులకు మహర్దశ కలిగిందని గడికోట ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రూ.70 లక్షల జిజిఎంపి నిధులతో సంబేపల్లె సికె రోడ్డు నుంచి పొన్నెల్ల వాండ్లపల్లెకు నిర్మించిన తారు రోడ్డును, నారాయణ రెడ్డి గారిపల్లె గ్రామంలోని ముద్దినేని వాండ్లపల్లెలో రూ.18 లక్షల జిజిఎంపి నిధులుతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయినేజీని ఆయన ప్రారంభించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత సంబేపల్లెలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. రూ.450 కోట్ల నిధులతో రాయచోటి నుంచి వేంపల్లె వరకు డబుల్ రోడ్డు పనులు ముమ్మ రంగా సాగుతున్నాయని, రూ.16 కోట్లతో పట్టణంలోని ఠాణా నుంచి సుండుపల్లె రహదారి మార్గంలోని రింగ్ రోడ్డు వరకు నాలుగు వరుసల రహదారి, రూ.70 కోట్ల ఇఎపి నిధులతో నియోజక వర్గ వ్యాప్తంగా సిసి రోడ్లు నిర్మించారని చెప్పారు. రూ.20 కోట్ల నిధులుతో ఆర్ అండ్ బి రోడ్లను రెన్యూవల్ చేయడం చేశామన్నారు. రూ.34 కోట్ల నిధులతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిసి రోడ్లు, తదితర అభివృద్ధి పనులు, పట్టణంలోని మదనపల్లె రహదారి విస్తరణ పనులను సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. రింగ్ రోడ్డును నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రూ.7 కోట్లతో మండల కేంద్రమైన గాలివీడులో నాలుగు వరుసల రహదారి సుందరీకరణ పనులు, రూ.2.30 కోట్ల నిధులతో రామాపురం మండలంలోని సరస్వతిపల్లె టు ఉడుంవారిపల్లె బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆవుల మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, సర్పంచ్ పూజల ఆలివేలమ్మ, వివి ప్రతాప్‌రెడ్డి, వసంత శ్రీనివాసులురెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, సర్పంచులు అంచల రామచంద్రా, మోహన్, వెంకట రమణ నాయక్, దండు నాగభూషణంరెడ్డి, ఎంపిటిసిలు భద్రయ్య, రాజకుమారి రఘు, కాకులపల్లె రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంకర్ యాదవ్, వెంకట రమణారెడ్డి, జె సిఎస్ కో- కన్వీనర్ అమరనాథరెడ్డి, లయన్ అశోక్‌రెడ్డి, జెసిబి ప్రతాప్‌రెడ్డి, శెట్టిపల్లె లక్ష్మీకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, వాయల్పాటి ఆనంద్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి శివయ్య, ఆర్‌ఎంపి మోహన్, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ బుల్లి వెంకట రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటా : 'మండిపల్లి'

ప్రజాశక్తి- రాయచోటి

రాబోయే రోజులలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని రాయచోటి టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జామియా ఫ్రూట్ మార్కెట్‌లో ఉన్న మండి వ్యాపారులను మర్యాద పూర్వకంగా అందరినీ ఆత్మీయంగా కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. పట్టణంలోని పండ్ల వ్యాపార సంబంధ సమస్యలపై ఆరా తీశారు. తనను గెలిపిస్తే ప్రతి వ్యాపార యజమాని తమ వ్యాపార కార్యకలాపాలను ఎటువంటి సమస్యలు, ఒత్తిడి లేని వ్యాపార లావాదేవీల కేంద్రంగా రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. సమయానుగుణంగా వాడుకొని, నమ్మించి మోసం చేసే కుటుంబం మండిపల్లిది కాదని, ఇక్కడి వ్యాపారులు మండిపల్లి కుటుంబీకులతో అన్నదమ్ములవలె ఉండేవారమని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిములకు ప్రభుత్వ ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని, మెటర్నిటీ ఆసుపత్రి కోసం అవసరమైతే తనవంతు సహాయంగా కోటి రూపాయలు స్వంత నిధులు ఖర్చు చేశానని హామీ ఇచ్చారు. అధికారం ఉన్నా, లేకున్నా అనునిత్యం ప్రజా సేవకే తమ జీవితం అంకితమని స్పష్టం చేశారు. వ్యాపారస్తులు, యజమానులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు కచ్చితంగా మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డికి ఉంటుందని, మరోసారి అబద్ధాలను నమ్మి మోసపోయేందుకు తాము సిద్ధంగా లేమని తెలిపారు. అనంతరం మండీ వ్యాపారస్తులందరూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రామ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని మండిపల్లి కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న రోజుల్లో టిడిపిలోకి మరిన్ని చెరికలు ఉంటాయని మండిపల్లి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, జాఫర్ వలి, మనోహర్ రెడ్డి, మండి ఇస్మాయిల్, జుల్ ఫక్రుద్దీన్, ఎస్‌కెబి. అంజద్, మండీ ఖదీర్, మండీ అంజద్, మండి బిలాల్, మండి అఖిల్, మండి చిన్న మగ్బూల్, మండి రూహుల్లా, మండి సికిందర్, మండి సాబిర్,మండి సమీవుల్లా, మండి షకీల్, మండి సౌడ్ ఇలియాస్, నాయుడు పలువురు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారులను కలిసిన రాంప్రసాద్‌రెడ్డి

బిజెపి ప్రలోభాలను ప్రజలు విశ్వసించరు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల ముందు వంట గ్యాస్ ధర తగ్గించినంత మాత్రాన, ప్రలోభాలు పెట్టినంత మాత్రాన బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్ తెలియజేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ప్యాకేజీపై ప్రశ్నించిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేడు బిజెపికి దాసోహమైందన్నారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సైతం రాష్ట్రాభివృద్ధిని మరచి బిజెపితో పొత్తు కోసం తహతహలాడుతున్నాయని, కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజా సమస్యలపై బిజెపిని నిలదీస్తుందని, రానున్న ఎన్నికలలో బిజెపితో పాటు, ఆ పార్టీకి అనుబంధమైన పార్టీలను కూకటి వేళ్లతో సహా పెకలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని తద్వారా నిరుద్యోగ సమస్యను నిర్మూలించగలుగుతామన్నారు.

పరిశోధనా పత్ర పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి : కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియంలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న ఆర్.జ్యోతి ప్రకాష్, మూడవ సంవత్సరం చదువుతున్న వి.మహేంద్ర పరిశోధన పత్ర పోటీలలో మొదటి బహుమతి పొందినట్లు మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రం, షీల్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ కుసుమ , తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు : మండలంలోని అడవిపల్లి సమీపంలోని శ్రీశ్రీశ్రీ మద్గుండాల మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం జాతరకు వచ్చిన భక్త జనానికి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. పారమెడికల్ సిబ్బంది శిబిరానికి వచ్చే భక్తులకు వ్యక్తిగత, పరిసరాల, చేతుల శుభ్రత, వాటి ఆవశ్యకత గురించి తెలియజేశారు. ముఖ్యంగా వేసవి వడగాల్పులకు ప్రజలు వడదెబ్బకు లోనుకాకుండా నీడ పాటున ఉంటూ, అధికంగా నీటిని తాగుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. 162 మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్‌ఎం ఫామున్నిసా, నాగవేణి, సిహెచ్ఒ కుముద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యులెవరో?

ప్రజా'దృష్టి'

జిఎంసి పరిధిలోని కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకల కారకులను గుర్తించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. కడప, పులివెందుల జిఎంసి పరిధిలోని జిజిహెచ్, సూపర్‌స్పెషాలిటీ, మానసిక, కేన్సర్‌కేర్ విభాగాలకు చెందిన 196 పోస్టుల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి దరఖాస్తుల ఆహ్వానం, పోస్టుల భర్తీ ప్రక్రియలో అడుగడుగునా అలసత్వం కనిపించింది. పోస్టులకు తగిన అర్హతలను నిర్ణయించడంలోనూ గందరగోళమే నెలకొంది. కర్నూలు, గుంటూరు జిల్లాల్లో మెడిసిన్, న్యూక్లియర్ ఫిజిసిస్ట్ పోస్టులకు అర్హతలు గుర్తించడంలో పొరపాటును అంగీకరించ లేదు. రాష్ట్రంలోని రాజమండ్రి, తూర్పుగోదావరి ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు పీజీ చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించారని నోటిఫికేషన్, సెలెక్షన్ జాబితాలను చూపుతున్నప్పటికీ జిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం క్షమించరాని అంశం. జిల్లాలోని ఎనిమిది వేల మంది నిరుద్యోగుల ఆశలతో, జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదనే సంగతిని గ్రహించాలి. నిరుద్యోగులతో జిఎంసి అధికార యంత్రాంగం విచక్షణారహితంగా వ్యవహరించడం దారుణం. రిజర్వేషన్లకు అర్హులను నిర్ణయించడంలో తడబడటానికి గల కారకులెరో తేల్చాలి. ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యలో ఆరితేరిన అధికార యంత్రాంగం వాస్తవంగా అనుభవం లేక తప్పిదాలకు ఆస్కారమిచ్చిందా, లేక ఇతర ఒత్తిళ్లేమైనా ఉన్నాయా, ఒకవేళ ఒత్తిళ్లు ఉంటే బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేయాలి. ఇటువంటి ప్రయత్నం చేయకుండా నిరుద్యోగుల ఆశలతో చెలగాటమాటడం తగనిపని. ఫైనల్ లిస్టు ప్రకటనకు ముందుగా వందలాది దరఖాస్తులు కనిపించడం లేదని ప్రచారం సాగింది. అప్పుడైనా జిల్లా కలెక్టర్, జిజిహెచ్ బాధ్య కలెక్టర్ మేల్కొని ఉండాల్సి ఉంది. మీడియాలో కథనాలు వెల్లువెత్తడంతో డిప్యూటీ సిఎం.అంజాద్‌బాషా సీరియస్‌గా స్పందించడంతో రీవెర్ఫికేషన్ తెరపైకి వచ్చింది. లేనిపక్షంలో రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండానే సెలెక్షన్ లిస్టు ప్రకటించడమేమిటని కలెక్టర్ ప్రశ్నించి ఉండాలి. అప్రూవల్ ఫైలుపై సంతకం చేయడానికి నిరాకరించి ఉండాలి. డిప్యూటీ సిఎం సీరియస్‌గా స్పందించిన అనంతరం రీవెర్ఫికేషన్ పూనుకోవడం గమనార్హం. రీవెర్ఫికేషన్ పేరుతో ఆగమేఘాల మీద పండుగలు, సెలవులతో నిమిత్తం లేకుండా జిల్లాలోని పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో రీవెర్ఫికేషన్‌కు పూనుకోవడం పట్ల విమర్శలు ఉన్నాయి. మీడియా కథనాలకు అందని అక్రమాలు వెలుగులోకి వస్తే పరిస్థితేమిటని, వాటిని కూడా అడ్రెస్ చేయడానికి తగిన గడువును ఇచ్చి ఉంటే బాగుండేదనే సూచనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా బాధ్య కలెక్టర్లు కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకలకు కారకులను గుర్తించి, కింది స్థాయి ఉద్యోగులను బలి పశువులను చేయకుండా బాధ్యత కలిగిన ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యాన్ని సైతం వెలుగులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జరి ఉత్సవానికి హాజరైన సందర్శకులు

జనసంద్రంగా జరి మహోత్సవం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవళంపేటలోని శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానంగా మహాశివరాత్రి మరుసటి రోజున నిర్వహించే జరి మహోత్సవానికి కడప, అన్నమయ్య , చిత్తూరు జిల్లాల నుంచి తండోపతండాలు జరి మహోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయం త్రం వరకు జరిలో స్నానాలు చేశారు. జరి మహోత్సవానికి ఆలయ ధర్మకర్త అఖిలేష్ కమిటీ సభ్యులు మదిపట్ల వెంకటరమణానాయుడు, శ్రీనివాసనాయుడు, మల్లికార్జున్ నాయుడు, రెడ్డప్ప నాయుడు భక్తులకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మదనపల్లి రెండవ డిపో 15 బస్సులు, పీలేరు ఆర్‌టిసి తొమ్మిది బస్సులను జరి మహోత్స వానికి భక్తులకు సౌకర్యం కల్పిం చారు.కలకడ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసు కోకుండా భారీ బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు బి.కొత్తకోటలో టిడిపి సమావేశం

ప్రజాశక్తి-ములకలచెరువు

నియోజకవర్గంలోని బి.కొత్తకోటలో ఆదివారం టిడిపి, జనసేన కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తంబళ్లపల్లి టిడిపి అభ్యర్థి జయచంద్రా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు స్థానిక బిసి కాలనీలో బైక్‌ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ర్యాలీ అనంతరం వెంక టేశ్వర కల్యాణ మండపంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలతో సమా వేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అలరించిన హరికథ కాలక్షేపం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని గుట్టపల్లి సమీపంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో జరుగుతున్న మహాభారత యుద్ధంలో భాగంగా శనివారం విరాటపర్వం హరికథ కాలక్షేపాన్ని భాగవతారని కౌసల్య కథ ప్రజలను ఆకట్టు కుంది. రాత్రికి తీర్చుకు వద్ద నాటకం ఉన్నట్లు మహాభారత యజ్ఞం నిర్వాహకులు పొత్తురి రవీందర్ నాయుడు తెలిపారు.

టిడిపి నాయకుడు రామ్మోహన్‌రెడ్డికి ఘన నివాళులు

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి నేత మహల్‌కు చెందిన ఎర్రదొడ్డి రామ్మోహన్ రెడ్డి అనా రోగ్యంతో మృతి చెందడంతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యు లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తిన పార్టీ అండ గా ఉంటుందని, వారు ఎలాంటి సహాయం అయినా చేయడానికి నేను సిద్ధంగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, నల్లారి చంద్రారెడ్డి తిమ్మాపురం రఘునాథరెడ్డి, రమణారెడ్డి, మల్‌రెడ్డి, మున్వర్, అలీ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిఐ జీవన్ గంగానాథ్‌బాబు

జాతరలో మద్యం విక్రయిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 11, 12 న జరగబోవు గంగమ్మ జాతర సందర్భంగా జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లి సీఐ జీవన్ గంగనాథ్‌బాబు హెచ్చరించారు.ఈ సందర్భంగా శని వారం లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ విష్ణువర్ధన్‌తో కలిసి గంగమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అమ్మవారికి చాందిని బండ్లు మొక్కుబడి ఉన్నవారు నిబంధనల మేరకు ఎత్తు తగ్గించి కట్టుకోవాలన్నారు. పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు.గంగమ్మ జాతరలో అశ్లీల నృత్య ప్రదర్శనలు, రికార్డ్ డాన్సులు, మైకులు, సౌండ్ సిస్టమ్ వంటివి ఏర్పాటు చేసి భక్తులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు.జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 16సిసి కెమెరాలు ఏర్పాటు చేసామని, దొంగతనాలు, మద్యం విక్రయాలు, పేకాట వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎక్కడి కక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, వాహన దారులు పోలీసులకు సహకరిం చాల ని అన్నారు. జాయింట్ వీల్ యాజమాన్యం, ఫిటినెస్ అనుమతులు తీసు కోవా లని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సామాన్య భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించేందుకు ఆలయం ముందు భాగం నుంచి భారీ కేడ్లను ఏర్పాటు చేసే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని చైర్మన్ రెడ్డయ్య, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, రవీంద్ర రాజులకు సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులకు అల్పాహారం

చెన్నూరు : మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పొలతల, నిత్య పూజ కోన, భైరవకోన, పుష్పగిరి, అల్లాడపల్లి దేవాలయ, వేయి నూతల కోన, జిల్లాలోని వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో యాత్రికుల కోసం మండల కేంద్రమైన చెన్నూరు కొత్త రోడ్డు వద్ద శనివారం ఉదయం కమిటీ నిర్వాహకులు అల్పాహారం అందించారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం మూడు గంటల వరకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గమ్యస్థానాలకు చేరే భక్తులు చెన్నూరు కొత్త రోడ్డు వద్ద తమ వాహనాలను ఆపి అల్పాహారంతో పాటు అన్నసంతర్పణ కమిటీ నిర్వాహకులు అందించారు.15 సంవత్సరాలుగా కొత్త రోడ్డు వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకున్న యజమానులు ప్రతి సంవ త్సరం శివరాత్రి మరుసటి రోజు తిరుగు ప్రయాణం భక్తులకు అన్నసంతర్పణ చేయడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో స్వచ్ఛంద కమిటీ నిర్వాహకులు చికెన్ సెంటర్ శివ, సుధాకర్ రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం :' కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రాఘవ రాజుపురంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు, ఐదు లక్షల రూపాయల వ్యయంతో నూతన నిర్మించిన అంగ న్వాడీ భవనాలను కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టామని ఇటీవల రైల్వే అండర్ బ్రిడ్జి, గుంజననదికి రక్షణగోడ, రెడ్డివారిపల్లె వంతెన తదితర పనులు ప్రారంభించి అందంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం రాఘవరాజుపురంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఆలయచైర్మన్ వై.రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, కోడూరు ఉప సర్పంచ్ తోట శివసాయి,స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మలిశెట్టి రమణ, సర్పంచ్ ఆర్‌వి.రమణ, జడ్‌పిటిసి రత్న

కొరముట్ల శ్రీనివాసులుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మ్మ, ఎక్స్‌ఎంపిటిసి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, కంభం శ్రీని వాసులురెడ్డి, అనిల్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఇర్ఫాన్, అంజి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఐఇఒ

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఐఇఒ కృష్ణయ్య నాయక్

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా డిఐఇఒ కృష్ణయ్య నాయక్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9న శనివారం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 12,513 మంది పరీక్షలు రాయవలసి ఉండగా వారిలో 66 మంది గైర్హాజరై 11,851 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించ డంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. కలకడ పరీక్ష కేంద్రంలో నిర్వహించిన మ్యాథ్స్ 1బి, జువాలజీ1, హిస్టరీ1 ,మైక్రో బయాలజీ 1పరీక్షలకు 277 మంది పరీక్షలు రాయవలసి ఉండగా, ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరై 261 మంది పరీక్షలు రాసినట్లు సిఎస్ ఎం.రమణయ్య తెలిపారు. అనం తరం కళాశాలలో ఐసిఐసిఐ బ్యాంక్ వారిచే ఏర్పాటుచేసిన ఆస్ట్రానమీ సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలి పారు.ఈ తనిఖీలలో డిపార్ట్మెంట్ అధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన రెడ్డివారిపల్లి పంచాయతీలో గుండ్లబురుజు మాదిగపల్లెలో జరిగింది. ఈ సందర్భంగా బాధితులు వి.వేణుగోపాల్, అరుణ దంపతులు మాట్లాడుతూ తాము కూలి పనులు చేస్తూ జీవిస్తు న్నామ ని అన్నారు. ఇటీవల ప్రభుత్వం పక్క గృహం మంజూరు చేయడంతో పూరి గుడిసెలో ఉంటూ పక్కా గృహం కొంతవరకు నిర్మాణం చేసుకున్నామని తెలి పారు. పక్కా గృహం పూర్తిగా నిర్మాణం చేయడానికి ఆర్థిక స్తోమత లేక పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నామని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయానికి రాత్రి జాగారణకు వెళ్లామని తెలిపారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయని అన్నారు. చూస్తుండగానే మంటలు అధికమై పూరి గుడిసె పూర్తిగా దగ్ధమై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను అదుపు చేసేందుకు స్థానికులు ఎంత ప్రయత్నించినా నష్టాన్ని నివారించలేకపోయారని అన్నారు. ప్రమాదంలో ఇంట్లోనే వస్తువులు, బట్టలు, విలువైన ధ్రువపత్రాలు, దాదాపు 20 గ్రాముల మేర బంగారు

బాధిత దంపతులు వేణుగోపాల్, అరుణ

నగలు అగ్నికి ఆహుతయ్యాయని, కట్టుబట్టలతో మిగిలామని అన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ, వైసిపి నాయ కులు నరేంద్రరెడ్డి కట్టుబట్టలతో మిగిలిన దంపతులకు తక్షణ సాయంగా తినటానికి అవసరమైన వస్తువులను, కూరగాయలను అందిం చారు. బాధిత దంపతులు ప్రభుత్వం తమను ఆదుకొని సాయం చేయాలని కోరారు.

కలికిరి : భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నఅర్చకులు

వైభవంగా కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని శ్రీయోగ నేల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం పగలు తిరుణాల కోలాహలంగా జరిగింది. జాతర సందర్భంగా నేలమల్లేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు చాందిని బండ్లు కట్టుకుని, డప్పు, మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి నేలమల్లేశ్వర స్వామి ఆలయ ప్రదక్షణలు చేశారు. వేల సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి దర్శనానికై పోటెత్తారు. దీంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. మదనపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వ యకర్త నిషార్ అహ్మద్ స్థానిక నాయకులతో కలసి నేల మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఇఒ మంజుల, ఉత్సవాల ప్రత్యేక అధికారి రవికుమార్, మండల వైసిపి మాజీ ఇన్‌ఛార్జి రమణారెడ్డి, ఆలయ తాత్కాలి కమిటీ సభ్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సందర్శకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి శ్రీ కామేశ్వర కల్యాణం ఆలయ పూజారులు శంకర్‌శర్మ, లక్ష్మ ణస్వామి, తదితరులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ సదా శివరెడ్డి, సర్పంచ్ మహదేవరెడ్డి, నాయి కులు నవీన్, సురేం ద్రరెడ్డి, ఆలయ తాత్కా లిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, నారా యణ, గంగాధర, రవి, శంకర, రవీంద్ర పాల్గొ న్నారు. **కలికిరి :** శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం పూలకొండలో అత్యంత వైభవంగా నిర్వ హించారు. శివరాత్రి మహోత్సవాలను పురస్క రించుకొని మండలం లోని గుట్టపాదం పంచా యతీ కె.బర్నేపల్లి పూలకొండలో వెలసిన శ్రీభ్ర మరాంబిక మల్లి కార్జునస్వామి కల్యాణోత్సవం శనివారం మధ్యా హ్నం అత్యంత వైభవంగా ధర్మకర్త డాక్టర్ వెంకట స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకున్న భక్తులు రాత్రంతా కథా కాలక్షేపం, భక్తి గీతాలతో జాగారం నిర్వహిం చారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి అన ంతరం విశిష్ట పూజలు నిర్వహించారు. మధ్యా హ్నం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి హజరైన వారికి అన్నదానం కార్యక్రమం నిర్వహిం చారు. **కలకడ :**మండలంలోని దేవలం పేట శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దేవలంపేట ఆలయం నుంచి ఎర్రయ్యగారిపల్లి కలకడ పుర వీధులలో పార్వతీ పరమేశ్వరులు బల్లారి డబ్బులు, మేళతాళాలు, గిరి నృత్యాల మధ్య ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అఖిలేష్, కమిటీ సభ్యులు లక్ష్మీ శ్రీనివాస ప్రసాద్, మద్దిపట్ల వెంకటరమనా యుడు, మల్లికార్జున నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రెడ్డప్ప నాయుడు, కుమార్ నాయుడు, రెడ్డి శేఖర్ నాయు డు, రామయ్య చౌదరి, జనార్ధన నాయుడు, రమేష్ నాయుడు, పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలసిన మాలే పెద్దయ్యస్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించి వచ్చిన భక్తాదులకు వడ్డించారు. **రామాపురం:** మండలంలోని హస నాపురం సమీపంలో వెలసిన శ్రీ గంగాభవాని సమేత మూలస్థానేశ్వర స్వామి ఆల యంలో తెల్లవారుజామున శివ పార్వతుల గ్రామత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ సత్యమ్మ వెంకటరెడ్డిలు తెలిపారు. ఈ రథోత్సవం క్లాస్‌వన్ కాంట్రాక్టర్ పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రావె త్సవం బెంగళూరు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇరు కుల మ్మ చైర్మన్ చిన్నరెడ్డన్న, చలమారెడ్డి, రాజారెడ్డి ఆంజనేయులురెడ్డి, హరినాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, అజీమ్ పాల్గొన్నారు.

కేంద్రబలగాలతో కవాతు నిర్వహిస్తున్న డిఎస్‌పి మహబూబ్‌బాషా

పీలేరులో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా నేతృత్వంలో కేంద్ర బలగాలతో కలిసి శనివారం పీలేరు పోలీసులు పట్టణంలో కవాతు చేశారు. రాబోయే ఎన్నికలు ప్రశాం తంగా నిర్వహించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగే ఎటువంటి చర్యలను ఉపేక్షించ బోమని హెచ్చరించారు. పట్టణంలోని అయ్యప్పరెడ్డి కాలనీ, ఎల్‌బిఎస్ రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, నాలుగురోడ్ల కూడలిలో కవాతు నిర్వ హించారు. కార్యక్రమంలో పీలేరు అర్బన్ సిఐ మోహ న్‌రెడ్డి, ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులను శిక్షించాలి : ఆవాజ్

ప్రజాశక్తి - బద్వేలు

స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆవాజ్ కమిటీ, కడప జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాష ,బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ఎ సత్తార్ మాట్లాడుతూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇంద్రలోక్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ముస్లిం సోదరులు నమాజ్ (ప్రార్థన) చేసుకోవానికి వెళ్లగా మసీదు నిండిపో వడంతో బయట నమాజ్ చేస్తుంటే వారిపై అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బూటు కాళ్లతో తన్ని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ప్రజలకు ప్రాణ, మాన రక్షణగా ఉండాల్సిన ఎస్ఐ ఉన్మాదిలో అత్యంత నిరంకుశంగా దాడి చేయడం సభ్య సమాజానికి సిగ్గుచేటున్నారు. ఇలాంటి ఘటనలను భారతదేశ ప్రజలు,కులాలు మతాలు అతీతంగా ముక్తకంఠంతో ఖండిం చాలన్నారు. ఈ ఘటనకు పాల్పడిన ఎస్ఐని, పోలీసులనుకఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆవాజ్ నాయకులు ఖాజా గౌస్, రసూల్. రఫీ, జిలాని, మాబు, గౌస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

కడప అర్బన్ : ఈ నెల 1న ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు జిల్లాలో ఒకటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదయిందని ఆర్ఐఒ వెంకట సుబ్బయ్య, స్పెషల్ ఆఫీజర్ జి. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం సిసి కెమెరాల్లో పరీక్షలను పర్యవేక్షించారు. గతేడాది కంటే ఈ సారి పెరిగిన విద్యార్థుల సంఖ్య పెరగడంతో జిల్లాలో 69 కేంద్రాల్లో మొదటి, రెండో సంవ త్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు ఆదేశం అనుసారంగా విద్యార్థుల కేటాయింపు బెంచ్‌కు ఇద్దరు మాత్రమే ఉండేలా సీటింగ్ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులకు కలిపి మ్యాస్ 1 బి, జువాలజీ, హిస్టరీ పేపర్ 14,758 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 14,152 మంది శనివారం పరీక్షలు రాశారన్నారు. 606 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

రేపటి నుంచి గంగమ్మ జాతర

చింతకొమ్మదిన్నె : మండల పరి ధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ జాతర మహో త్సవం ఈ నెల 11న వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బుసిరెడ్డి పార్వతమ్మ గారి విశ్వనాథ రెడ్డి, కార్యనిర్వహ ణాధికారి(ఇఒ)పి.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు శనివారం గంగమ్మ దేవాలయం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ శ్రీ గంగమ్మ జాతర మహోత్సవాలు స్వస్తిశ్రీ శోభ కృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పాడ్యమి 11 నుంచి మంగళవారం వరకు రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. 11న నిండు తిరుణాల, 12న మైల తిరుణాల ఉంటుందని తెలిపారు.

బాధితులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

పేదలకు సాయం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

పేదలకు సాయం చేయడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ముక్కారూపానందరెడ్డి తనయడు సాయి వికాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారంలో మండలంలో చిన్నంపల్లి పంచాయతీ లింగి రెడ్డిపల్లి దళితవాడలో ఆకస్మాత్తుగా మరణించిన లేబాకు రెడ్డమ్మ, పెంచలయ్య కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకొని రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. చిన్నంపల్లి పంచాయతీ పరిధిలో లింగిరెడ్డిపల్లి ఎస్‌టి కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న కోటపాటి మణయ్య కుటుంబానికి రూ.20వేల చెక్కును అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుండుశివారెడ్డి, సల్లా వెంకటసుబ్బారెడ్డి, చవకుల శంకరయ్య, గుండు గురవారెడ్డి నారంరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, గుండు పెంచల్ రెడ్డి, సుబారాయుడు, శ్రీనివాసులు, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు.

వైసిపితోనే మైనార్టీల సంక్షేమం

ప్రజాశక్తి-పీలేరు

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వంలోనే సాధ్యమని అన్నమయ్య జిల్లా పంచాయితీ రాజ్ అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన పీలేరు పట్టణంలోని పలు డ్వాక్రా సం ఘాల మహిళలతో కలసి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల ఆదేశాల మేరకు తన వంతు కృషిలో భాగంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి పెద్దోడు, ఎంపిటిసి ఇబ్రహీం, జోహార్, ఎఎంసి డైరెక్టర్ మునీర్, వార్డు సభ్యులు ఆబిద్, పరమేష్, పిక్కారమణ,నాయకులు జిలానీ, ముస్తాక్, కదిరి రఫీ, స్వీట్స్ షఫీ, మాజీ ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, ఎల్ఐసి రహమతుల్లా, మహబూబ్‌బాషా, షారూ, మొహమ్మద్ షరీఫ్, అక్రమ్, షాకీర్, నిజాం, అబ్బాస్, మణి పాల్గొన్నారు.

ప్రచారంలో మైనార్టీ నాయకులు

క్రైం కార్నర్

నిందితుడి అరెస్టును చూపుతున్న డిఎస్‌పి

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

- రూ.2.80 లక్షల నగదు సీజ్ : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి

యజమానికి డ్రైవర్‌గా పనిచేస్తూ నమ్మకద్రోహానికి పాల్పడడమే కాకుండా ఇంట్లో ఉన్న రెండు లక్షల 80 వేల రూపాయల నగదును చోరీ చేసిన దొంగను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. నిందితుడి అరెస్టుకు సంబంధించి మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి, తాలుకా సిఐ ఎన్.శేఖర్ కథనం మేరకు... మదనపల్లి మండలం తట్టివారిపల్లి సమీపంలోని పుంగనూరు వాండ్లపల్లెలో కాపురం ఉంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ప్రొఫెసరకు నమ్మకానికి మారుపేరుగా ఉండే వాడన్నారు. ఈ క్రమంలో అతనిని నమ్మి ఇంటి తాళం ఒకటి కారు డ్రైవర్ చంద్రశేఖర్‌రెడ్డికి ఇచ్చి మరో తాళం యజమాని దగ్గరే ఉంచుకున్నాడని చెప్పారు.ఈ క్రమంలో ప్రొఫెసర్ వెంకటరెడ్డి సొంత పనిపై బయట వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేనిది గమనించిన చంద్రశేఖర్‌రెడ్డి గత నెల 24న ప్రొఫెసర్ ఇంటి తాళాలు తెరిచి బీరువాలో ఉన్న నగదు రూ.2.80లక్షలు నగదు చోరీ చేశాడని చెప్పారు. ఆలస్యంగా గుర్తించిన ప్రొఫెసర్. ఇంట్లో నగదు చోరీ జరిగిన విషయాన్ని మదనపల్లి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ ఎన్.శేఖర్, ఎస్ఐలు రవికుమార, వెంకటేష్, ఏఎస్ఐ టెక్నికల్ సిబ్బందితో కలిసి క్లూస్ టీం ఇచ్చిన ఆధారాలతో చౌడేపల్లి మండలం, కాట్పేరి గ్రామం, గురు మర్దనపల్లికి చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం మదనపల్లి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకొని అతని వద్ద నగదు సీజ్ చేసి అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రవికుమార్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, ఐడి పార్టీ సిబ్బంది మహమ్మద్, సింహలు, ప్రభాకర్, డిఎస్‌పి, సిఐ లు అభినందించి రివార్డులకు రెకమెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి..

- మద్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లి

కురబలకోట మండలంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నిందితున్ని శనివారం ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి అరెస్టుకు సంబంధించి సిఐ సద్గురుడు, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం చీకిలబైలుకు చెందిన నందీస్ శనివారం కురబలకోట మండలం, దొమ్మన్నబావి దగ్గర కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అందడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో వెళ్లి చలపతి హోటల్ వెనుక చీకలు బైలుకు చెందిన నందీస్, హోటల్ యజమాని చలపతి ఇద్దరు కలిసి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను అమ్ముతుండగా దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో చీకిల బైలు నందీశ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అక్కడ లభించిన 170 కర్ణాటక మద్యం 90 ఎంఎల్. డబుల్ కిక్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు చలపతి అక్కడి నుంచి పారిపోవడంతో అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించి కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు, నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.NO: 68/2023 in O.S 14/2023

తల్లపనేని వెంకటరమణ తండ్రి టి రామయ్య, డోర్ నెంబర్ 6/518-ఎ, కృష్ణానగర్, రాజంపేట, అన్నమయ్య జిల్లా

...Plaintiff

వర్సెస్

D2 ఆరే జనార్ధన్ నాయుడు, తండ్రి నారాయణ నాయుడు,బావికాడపల్లి గ్రామం, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...Deffendant

డిఫెండెంట్ నెం.2కు నోటీస్

పైన తెలిపిన వాది, మీ పైన పై తెలిపిన కోర్టులో ఇంజక్షన్ కొరుచూ పిటీషన్ దాఖలు చేసియున్నారు. ఇందుకుగాను మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 20.03.2024 వ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టులో మీరు నేరుగా గానీ , వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఎన్ రెడ్డయ్య, ఎస్.మహమ్మద్ ఆలి

అడ్వకేట్స్, నందలూరు.

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No.14/2023

తల్లపనేని వెంకటరమణ తండ్రి టి రామయ్య, డోర్ నెంబర్ 6/518- ఎ, కృష్ణానగర్, రాజంపేట, అన్నమయ్య జిల్లా.

...Plaintiff

వర్సెస్

D2.ఆరే జనార్ధన్ నాయుడు, తండ్రి నారాయణ నాయుడు, బావికాడపల్లి గ్రామం, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...Deffendant

డిఫెండెంట్ నెం.2కు నోటీస్

పైన తెలిపిన వాది, మీ పైన పై తెలిపిన కోర్టులో డిక్రీ కోరుతూ దావా దాఖలు చేసియున్నారు. ఇందుకుగాను మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 20.03.2024 వ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టులో మీరు నేరుగా గానీ , వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఎన్ రెడ్డయ్య, ఎస్.మహమ్మద్ ఆలి

అడ్వకేట్స్, నందలూరు.